
# ఉద్యోగపర్వం

కె.మురళీకృష్ణ



'నేను ఉద్యోగంలో చేరుతున్నాను'. మంచి నీళ్ల చెంబు టేబిల్ మీద పెడుతూ చెప్పింది నీరజ.

సుధాకర్ పుస్తకంలోంచి తల ఎత్తలేదు.

తన అయిష్టాన్ని వ్యక్తపరచటంలో మౌనం సుధాకర్ పద్ధతి అని నీరజకు తెలుసు.

'నేను రేపే ఉద్యోగంలో చేరుతున్నాను' మంచం మీద కూచుంటూ మళ్లీ గట్టిగా చెప్పింది నీరజ.

సుధాకర్ పుస్తకం మూసేసి మౌనంగా దిండు మీదకు చేరగిలపడ్డాడు.

'మీతోనే చెప్పేది, నేను రేపే ఉద్యోగంలో చేరుతున్నాను'

'నువ్వు నిర్ణయం తీసేసుకున్న తరువాత, ఆ నిర్ణయం పట్ల నా అభిప్రాయం ఏమిటో తెలిసిన తరువాత, మళ్లీ మళ్లీ నాకు చెప్పటం ఎందుకు?' సూటిగా అడిగాడు సుధాకర్.

నీరజ సుధాకర్ మీద చేయివేసి మృదువుగా అడిగింది. 'మీకు నిజంగా నేను ఉద్యోగం చేయటం ఇష్టంలేదా?'

సుధాకర్ ఆమెని దగ్గరగా లాక్కున్నాడు. 'నీకు ఇష్టమే కదా చేరిపో' అన్నాడు. 'అలా కాదు నీకు ఇష్టమైతేనే నేను చేరతాను' సుధాకర్ చేత మనస్ఫూర్తిగా 'చేరు' అనిపించాలని ఆమె ప్రయత్నం.

సుధాకర్ నవ్వాడు. 'నిజంగా ఇప్పుడు నువ్వు ఉద్యోగం చేయకపోతే గడవదా? నా సంపాదనలో సమస్య ఏమీ లేకుండా ఇల్లు గడుస్తోంది కదా! ఇప్పుడు నువ్వా సంపాదించి మనవేం చేయాలి? ఇళ్లు కట్టాలా? కార్లు కొనాలా?

నీరజ మూతి ముడుచుకుంది. 'మళ్లీ మొదలు' అనుకుంది మనసులో. నీరజ మూతి ముడవటం చూసి నవ్వాడు సుధాకర్. 'అందుకే అన్నాను. నీ ఇష్ట ప్రకారమే కానీ అని' అన్నాడు.

సుధాకర్ నవ్వు చూడగానే నీరజకు వొళ్లు మండింది.

'అవునండి. మీరు హాయిగా బయట తిరిగి వస్తారు. ఇంట్లో ఉట్టిగా కూచుని ఏం తోచక నేను చచ్చిపోతున్నాను తెలుసా? ప్రొద్దున్నే లేవగానే అంట్లు, వంట, టిఫిన్లు, భోజనాలు. మీరు ఆఫీసుకి వెళ్లగానే మళ్లీ అంట్లు, బట్టలు, టీవీ సాయంత్రం అవుతున్న కొద్దీ మీరెప్పుడు వస్తారో అని ఎదురుచూపులు. మీరు రాగానే కాఫీలు, టిఫెన్లు, మళ్లీ వంట, మళ్లీ అంట్లు ఇక పడుకోవటం, మళ్లీ లేవగానే అంట్లు, వంట..... ఇంతేనా నా బతుకు? నా బతుక్కి ఇంకో అర్థం లేదా? నేను డిగ్రీ చదివాను. మరి నా చదువంతా వృధాయేనా?

నాతో చదివిన వాళ్లంతా ఎక్కడో ఏదో ఉద్యోగం చేస్తూ డబ్బులు సంపాదిస్తూనే ఉన్నారు. నేనే ఎందుకూ పనికి రాకుండా ఈ నాలుగు గోడలకు పరిమితమై పోయాను.

ఆ సరళ చూడండి. అసలు క్లాసులో మొద్దులా ఉండేది. ఇప్పుడది స్టెనో'ట. పెదాలకి లిప్‌స్టిక్, స్లీవ్‌లెస్ బ్లౌజు, ఆ కైనటిక్ హోండా మీద దాని స్పీడు.... మొన్న నేను బజారు నుంచి కూరలు తెస్తుంటే కలిసింది 'హౌజ్ వైఫా'? అంది ఎంత చులకనగా మాట్లాడిందో తెలుసా?

నాలుగు ఇంగ్లీషు ముక్కలు కలిపి సరిగ్గా మాట్లాడలేదు. దానికి నెలకు నాలుగువేలట జీతం. నేను ఎందుకూ పనికిరాకుండా ఇంట్లో అంట్లు తోముతూ-'

'నువ్వు ఇంట్లో చేసే పని వెల లేనిది, విలువైనది తెలుసా?' అన్నాడు సుధాకర్. దాంతో నీరజ కోపం మరింత పెరిగింది.

'మీకసలు నాకంటూ ఓ ప్రత్యేకత ఉండటం ఇష్టంలేదు. నాకంటూ ఓ ప్రత్యేక జీవితం ఉండటం ఇష్టం లేదు. ఎంతసేపూ అటు సుధాకర్ భార్యగానో ఇటు మీ పిల్లల తల్లిగానో అందరికీ తెలియాలిగానీ నా కాళ్ల మీద నేను స్వతంత్రంగా నిలబడటం మీకు ఇష్టం లేదు'

సుధాకర్ మరోవైపు తిరిగి పడుకున్నాడు.

'నేను డబ్బులు సంపాదిస్తే మిమ్మల్ని లెక్క చేయనని మీకు భయం అంతేనా?' సుధాకర్‌ని బలవంతంగా తనవైపు తిప్పుకుంటూ అడిగింది నీరజ. సుధాకర్ నవ్వాడు. 'నీకు అన్నీ తెలుసుగా, నన్నడగటం దేనికి?' అన్నాడు. నీరజకు చిరాగ్గా అనిపించింది. 'ఇంతకీ నేను ఉద్యోగం చేస్తే మీకు అభ్యంతరం ఏమిటి?'

"ఈ చర్చ మన మధ్య ఎన్నో సార్లు జరిగింది కదా, మళ్లీ ఎందుకు? నీ ఇష్టం అన్నా కదా?'

'నా ఇష్టం సరే. మీకెందుకు ఇష్టం లేదు?'

'నీరజా! నా దృష్టిలో నువ్వొక అపురూపమైన వ్యక్తివి. ఒక సుందర పుష్పానివి. నా జీవితంలో వెన్నెల వెలుగులు నింపి, ఆనంద జ్యోతిని వెలిగించిన వ్యక్తివి. కన్నవారిని, ఉన్నవారిని విడిచి కొత్త జీవితం ప్రారంభించేందుకు సంపూర్ణంగా నన్ను నమ్మి నా ఆత్మ విశ్వాసాన్ని పెంచిన దేవతవి.'

'కవిత్వం ఆపండి. నాకేమీ మస్కా కొట్టక్కర్లేదు' సుధాకర్ మాటలకు ఓ పక్క పొంగిపోతూ, చిరుకోపం ప్రదర్శించింది నీరజ.

'ఇది మస్కా కాదు నిజం! నీకు మస్కా కొట్టాల్సిన అవసరమే నాకు లేదు.'

'మరి?'

'నా దృష్టికి నువ్వు అపురూపం, కానీ అందరి దృష్టికి కాదు కదా. నువ్వు ఇల్లుదాటి బయట అడుగుపెట్టిన మరుక్షణం బయట జనంలో నువ్వూ ఒకర్తివి అయిపోతావు. బస్సుల కోసం వరుగెత్తాలి, తోసుకుంటూ ఎక్కాలి, కమ్మీలు పట్టుకుని వేళ్లాడాలి. చిల్లర లేక తిట్లు తినాలి. తోపుళ్లు, రాపిళ్లు భరించాలి.

ఇవన్నీ అయి ఆఫీసు చేరితే ఆఫీసులో తోటి కొలీగుల తుంటరి చూపులు, వంకర మాటలు భరించాలి. 'బాసా'సురుల ఆధిపత్యాన్ని సహించాలి. ఇవన్నీ భరిస్తూ రోజుకో ఎనిమిదిన్నర గంటలు ఓ యంత్రంలా పని చేయాలి. ఇంత చేసినా మళ్లీ నువ్వు బయలు దేరేముందు ఏదో అర్జంటు పని వస్తుంది.

ఆ పనీ చేసి మళ్లీ బయటకొచ్చి బస్సారణ్యంలో ప్రయాణం చేసి ఇంటికి రావాలి.

ఇంటికొచ్చేసరికి నీలో జీవం ఎగిరిపోతుంది. అలసిసొలసి ఇంటికి చేరగానే చేయవలసిన పని నీ కోసం ఎదురు చూస్తూ కనిపిస్తుంది. అప్పుడొస్తుంది నీకు చిరాకు. అదంతా ప్రదర్శించేది నామీదే.

అదంతా అయిందనిపించి ఏవో నాలుగు మెతుకులు కతికేసరికి నిద్ర కళ్లమీద ఉంటుంది. మళ్లీ తెల్లారి లేచేసరికి

అంట్లు, వంటతో పాటు ఉద్యోగపు తంటా కూడా తప్పనిసరి. ఎందుకు చెప్పు, ఆ ఉద్యోగంలో వాడిచ్చే వెయ్యి రూపాయల కోసం నువ్వు నువ్వులా కాకుండా ఓ యంత్రంలా అయిపోవటం ఎందుకు చెప్పు?' నీరజ మౌనంగా ఉంది.

'చూడు నీరజా! ఆడవాళ్ల ఉద్యోగం చేయటానికి నేను వ్యతిరేకిని కాను. అత్యవసరమైతే ఉద్యోగం తప్పనిసరిగా చేయాలి కానీ అవసరం లేనప్పుడు చేయనవసరం లేదు. టీచర్ ఉద్యోగం ఆడవాళ్లకు చాలా మంచిది. నీలో మాతృభావనలు జాగృతం అవుతాయి. దాని ద్వారా పిల్లలు కూడా బాగుపడతారు.

చూడు నీరజా, నువ్వు డబ్బు సంపాదించేస్తేనే నీ జీవితానికో సార్థకత, నీకో వ్యక్తిత్వం, ప్రత్యేకత వచ్చేస్తాయని అనుకోవటం పొరపాటు. నువ్వు ఉద్యోగానికి వెళ్లటం ద్వారా నీకూ నాకూ మధ్య దూరం కూడా పెరుగుతుంది.'

'ఎందుకని?'

'లెక్కవెయ్యి, పొద్దున్నే ఎనిమిదిన్నరకు బయలుదేరిన నువ్వు రాత్రి ఏడున్నరకో, ఎనిమిదికో ఇల్లు చేరతావు. అంటే దాదాపుగా పన్నెండు గంటలు పోయినట్టే.

మిగిలిన పన్నెండు గంటల్లో ఏడు గంటలు నిద్రకు తీసెయ్యి. మిగిలినవి అయిదు గంటలు. ఆ అయిదు గంటల్లో నీ వంట, అంట్లు, ఉద్యోగానికి తయారీ పోగా మనిద్దరికీ ఏకాంతంగా దొరికే సమయం ఎంత?

ఆ సమయంలో నీ పని అలసటతో వచ్చే చిరాకు తప్ప, ఇరువురి సహచర్యంలో మాధుర్యం అనుభవించే ఓపిక ఎవరికీ ఉండదు. ఇక దాంపత్యబంధంలో అనుబంధం ఏం ఉంటుంది?

నీరజా, సంసారం అనేది స్త్రీ, పురుషులిరువురూ ఒకరినొకరు అర్థం చేసుకుని సాగించవలసిన సహజీవనం. దీన్లో ఇరువురికీ ప్రత్యేకమైన వ్యక్తిత్వాలు, అహంకారాలు, ఆత్మ గౌరవాలు అంటూ వేర్వేరుగా ఉండవు. ఉన్నాయంటే ఆ సంసారబంధంలో ఏదో లోపం ఉన్నదన్న మాటే.

నీకో ప్రత్యేకత లేదన్నావు. నా ప్రత్యేకతే నీ ప్రత్యేకత. నా ఆత్మగౌరవమే నీ ఆత్మగౌరవం. సంసారంలో నీ నా అన్న ప్రసక్తే లేదు. అంతా మనదే. రోజుకో ఎనిమిది గంటలు కష్టపడి నువ్వు సంపాదించే వెయ్యి రూపాయల కన్నా, ఒక రోజు సాయంత్రం అస్తమిస్తున్న సూర్యుడిని చూస్తూ ఒకరి సాహచర్యంలో మరొకరం పొందే సాంత్వన ఎంతో విలువైంది. అటువంటి ఎన్ని సాయంత్రాలు వృధా అయిపోతాయో ఆలోచించు.'

'చాల్లెండి. ఇటువంటి మాటలు చెప్తూనే యుగయుగాలుగా మీ పురుషులు మమ్మల్ని బుట్టలో వేసుకుంటున్నారు. వంటింట్లో సంకెళ్లు వేసి బిగిస్తున్నారు' సుధాకర్ మాట్లాడలేదు. మౌనంగా నీరజని దగ్గరకు లాక్కున్నాడు.

* * *

'వెధవ ఉద్యోగం. వెయ్యి రూపాయలిస్తూ మనిషినే కొనేసినట్టు ప్రవర్తిస్తారు.' బ్యాగు టేబిల్ మీదకు విసిరేస్తూ అరిచింది నీరజ.

పేపరులోంచి తలెత్తలేదు సుధాకర్.

'ఎక్కడ ఇల్లు అక్కడే ఉంది. ఇంటికి త్వరగా వచ్చిన వాళ్లు కాస్త ఇల్లు సర్దవచ్చుగా?' గట్టిగానే గొణిగింది నీరజ.

సుధాకర్ పేపరులో ఓ పేజీ తిప్పాడు.

'వెధవ బతుకు' పని చేసే ఆడవాళ్లంటేనే చులకన మగవాళ్లకు. అస్సలు ఆడవాళ్లనెప్పుడూ చూడనట్టే ప్రవర్తిస్తారు వెధవలు.ఎక్కడ చచ్చింది కుక్కరుమీద విజిల్?'

సుధాకర్ పలకకపోవటంతో 'మీరేమైనా కుక్కర్‌మీద విజిల్ తీశారా?'అరిచింది నీరజ.

'లేదు' అన్నాడు సుధాకర్.



'అబ్బ ముత్యాలు రాలేయి. ఒక్క పనికి రారుకదా ముందుకు. అన్ని పనులూ నేను చేసుకోవాలి. ఛస్తున్నాను. అయ్యో పాపం అని కూడా అనిపించదు. ఆఫీసులో టైపు చేసీ చేసీ చేతులు పడిపోయాయి. వెయ్యి రూపాయల బానిసను నేను. లంచ్ తినేందుకూ టైమ్ లేదు. లంచ్ బాక్స్ తెరవగానే 'ఏమ్మా ఎన్ని గంటలు తింటారు? త్వరగా కానీండి' అంటాడు. వాడు బయట హోటల్లో మెక్కి వస్తాడు.

ఆరుదాకా చేతులు పడిపోయేలా టైపు చేస్తానా, బ్యాగు సర్దుకుంటూంటే 'అప్పుడే ఆరయిందా?' నిన్ను చూసి వాచి సరి చేసుకోవచ్చమ్మా' అంటూ ఛస్తాడు. 'అర్జంటమ్మా, ఇదొక్కటి' అంటాడు. అదయ్యే సరికి ఆరున్నర. అంతలో మరో అర్జంటు. కాదనలేము. ఏమైనా అంటే 'అంత తొందరేమిటమ్మా, ఇంటికెళ్లి ఏం చేయాలి?' అంటాడు. వాడికేం తెలుసు? మగవెధవ.

ఈ కారం ఎవరు వేశారు? ఎక్కడ పెట్టారు?'

'పొద్దున్న ఎక్కడ పెట్టావో గుర్తు తెచ్చుకో, అక్కడే ఉంటుంది' అన్నాడు సుధాకర్. 'చేసే సహాయం లేదు కానీ వెధవ వ్యంగ్యం వొకటి' ఆమె కోపానికి రెండు గిన్నెలు వంత పాడేయి.

'కాస్త త్వరగా వొదిల్తే ఏం కొంపలంటుకుపోతాయో, రోజూ పడుకునే సరికి పదకొండు. మళ్లీ పొద్దున్న లేవగానే పరుగులు. నిద్ర సరిపోవటం లేదు. పొద్దున్న లేవగానే తొందర తప్పించి ఇంకేమీ లేదు' సుధాకర్ పక్కనే పడుకుంటూ అంది నీరజ.

సుధాకర్ నీరజపై చేయివేసి దగ్గరకు లాక్కోబోయాడు. నీరజ అసంకల్పితంగా సుధాకర్ చెయ్యి విసిరి కొట్టింది. వెంటనే తనే సుధాకర్‌ని దగ్గర లాక్కుంటూ 'సారీ' అనబోయింది. ఆవలింత ఆ 'సారీ'ని మింగేసింది. 'పర్లేదు, పడుకో' అన్నాడు సుధాకర్. అతని మాట పూర్తయేలోగానే నిద్రలోకి జారిపోయింది నీరజ.

* * *

'వెధవ ట్రాఫిక్ జామ్. ఉత్తరం అర్జంటుగా కొరియర్‌లో వెళ్లాలని ఆపేశాడు ఏడున్నరదాకా. బస్సు దొరికి చావలేదు. దొరికినా అది కదిలితేనా? నడుస్తూ వచ్చినా త్వరగా ఇల్లు చేరేదాన్ని. తొమ్మిదిన్నర చూపిస్తున్న వాచీని చూస్తూ సోఫాలో చేరగిలబడింది నీరజ.

'లే, నీళ్లు వేడయిపోయాయి. స్నానం చెయ్యి, తినేద్దాం' అన్నాడు సుధాకర్.

'ఇంకా వంట కాలేదని తెలిసి కూడా తినేద్దాం అంటారు. నా దగ్గరేమైనా మాయ మంత్రాలున్నాయా, ఇంట్లో లేకుండానే వంట చేసేందుకు?'

'ఎనిమిదిన్నర అయినా రాకపోతే హోటల్ నుంచి భోజనం వట్టుకొచ్చాను.'

'ఇంత జాలి ఎప్పటి నుంచో మామీద?' వ్యంగ్యంగా అంది నీరజ.

'నువ్వు ఉద్యోగంలో చేరకముందు నుంచి' అన్నాడు సుధాకర్ నవ్వుతూ. ఒక్క క్షణం సుధాకర్ అన్న మాటలు నీరజకు అర్థం కాలేదు. అర్థం అయిన వెంటనే ఆమెకు దుఃఖం పొంగుకొచ్చింది. ఎంత ఆపినా ఆగకుండా కన్నీళ్లు రాసాగాయి. సుధాకర్ ఆమెని దగ్గరగా లాక్కుని 'మానేసెయ్ పిచ్చి ఉద్యోగం. అది లేకపోతేనే హాయిగా ఉంది' అన్నాడు.

ఆమె దుఃఖం మరింత పొంగింది. 'మరి అందరూ ఉద్యోగాలు చేస్తున్నారు కదా?' అంది వెక్కిళ్ల మధ్య.

'అందరి సంగతి మనకనవసరం. చూడు నీరజా పురుషుడు చేసిన పనులన్నీ చేస్తేనే స్త్రీకి వ్యక్తిత్వం, విలువ అని అనుకోవటం స్త్రీ ఆత్మన్యూనతా భావానికి నిదర్శనం. అలాగే డబ్బు సంపాదిస్తేనే జీవితానికో అర్థం అనుకోవటం మూర్ఖత్వం.

మన సమాజంలో వివాహ వ్యవస్థకు విశిష్ట స్థానం ఉంది. రెండు విభిన్న ప్రవృత్తులు కల వ్యక్తులు కలసి సాధించే సహజీవనమే సంసారం. ఇరువురి భిన్న ప్రవృత్తుల వల్ల చెలరేగే అలల తాకిడికి తట్టుకుంటూ, తుఫానులను ఎదుర్కొంటూ సంసార నౌక సాగిపోవాలి. ఒకరికొకరు చేయూతనిస్తూ తుఫాను తాకిడిని ఎదుర్కొంటూ కలసి మెలసి సాగించేదే దాంపత్యం.

నీరజా! భార్యభర్తలిరువురు బండి చక్రాల వంటి వారు. దీన్లో హక్కులు లేవు. హెచ్చు తగ్గులు లేవు. ఒక వృక్షం బలంగా ఉండాలంటే వ్రేళ్లు భూమిలో పాతుకుని ఉండాలి. సంసార వృక్షంలో వ్రేళ్లు స్త్రీ అయితే బయట కనిపించే వృక్షం పురుషుడు. ఫలాలు పిల్లలు.

బయట ఉద్యోగం చేసి సంపాదించేకన్నా, అత్యవసరం లేనప్పుడు ఇంట్లో ఉండి ఇంటిని తీర్చిదిద్ది, ఇంట్లో మనుషులకు మానసిక స్వాస్థతనివ్వటం ఎంతో కఠినమైన పని.

రేపు మనకు పిల్లలు పుడతారు. అప్పుడీ చిరాకు ద్విగుణీకృతం కాదూ? పిల్లలని చూస్తూ, ఇంటి పని చేస్తూ, ఉద్యోగం చేస్తూ.... ప్రస్తుతం మహిళ మీద ఎంత ఒత్తిడి ఉంటోందో తెలుసా? గతంలో ఇంట్లో కేవలం మొగుడి మనస్తత్వానికి తగ్గట్టు మసలుకుంటే సరిపోయేది.

ఇప్పుడు ఆఫీసులో వ్యక్తుల మనస్తత్వాలతోనూ రాజీ పడాలి. బాస్ మూడ్స్‌కి అనుగుణంగా వ్యవహరించాలి. వీటితో పాటు భర్తనూ భరించాలి. అక్కడకు వొచ్చేసరికి ఓపిక ఉండదు.

ఇక పిల్లల బాగోగులేం చూస్తారు? ఇద్దరూ ఉద్యోగాలకు వెళ్తూ పిల్లల్ని 'క్రష్' లల్లో వదలాలి. ఎదిగే వయసులో పిల్లవాడికి తల్లిదండ్రుల సాన్నిహిత్యం ఎంతో అవసరం. తనో అద్భుతమైన సృష్టి అని, తనను మించి తల్లిదండ్రులకీ ప్రపంచంలో ఇంకేమీ లేదన్న భావనే పిల్లవాడి ఆత్మవిశ్వాసం.

ఆదరాబాదరాగా 'క్రష్'లలో వదలి, అలసిపోయి వాడిని ఇంటికి తెచ్చి విసుగ్గా పనులు చేసే తల్లిదండ్రుల మధ్య ఏ రకంగా పిల్లవాడు ఆరోగ్యంగా ఎదుగుతాడు?

ఈ పరిస్థితుల వల్లే పాశ్చాత్య దేశాల్లో అన్ని రకాల మానసిక రోగాలు, అంతమంది మానసిక రోగులు!

మన దగ్గర దాంపత్య జీవితంలోని సమతుల్యతే రేపటి మన పిల్లల ఆరోగ్యకరమైన భవిష్యత్తు. మన దృష్టి రేపటి తరం మీద ఉండాలికానీ ఇవాళ నేను ' నా ఆత్మగౌరవం' అనే ఆలోచనల మీద ఉండకూడదు.

'మనం' 'మన ఆత్మగౌరవం' అని ఆలోచించాలి. మన సమాజం, మనదేశం అనే ఆలోచనకు నాందీ ప్రస్తావన కుటుంబంతోనే ఆరంభమవుతుంది అన్నాడు సుధాకర్ అనునయంగా.

నీరజ అతని కళ్లలోకి చూసింది.

ఆ కళ్లల్లో ఆమెకు సుధాకర్ కంటున్న సుందర స్వప్నం కనిపించింది. 'ఆ స్వప్నం అతనిదే కాదు, తనదీనూ' అనుకుంది నీరజ.

●